834) మాళవిగౌళ / శహన

ప॥ శరణు శరణు నీకు జగదేకపతి కృష్ణ। వరములొసగవయ్యా వాసుదేవ కృష్ణ॥

చ॥ మద్దులు విరిచినట్టి మాధవ కృష్ణ। సుద్దులు చెప్పవయ్యా అచ్యుత కృష్ణ।
వొద్దు రాగదవయ్య ఉపేంద్ర కృష్ణ। ముద్దులు గిరియవయ్య ముకుంద కృష్ణ॥

చ॥ గొల్లెతల మరిగిన గోవింద కృష్ణ। చెల్లునయ్య నీచేతలు శ్రీధర కృష్ణ।
అల్లన దొంగాడవయ్య హరి శ్రీకృష్ణ। మల్లుల గెలిచినట్టి మధుసూదన కృష్ణ॥

చ॥ గోవుల గాచిన యట్టి గోపాల కృష్ణ। కైవశమై మమ్మేలు శ్రీకర కృష్ణ।
నా విన్నపమాలించు నారాయణ కృష్ణ। సేవకుడ నీకు జుమ్మీ శ్రీవేంకట కృష్ణ॥